క్లుప్తంగా

వాహనాల వేలం ద్వారా రూ.6.03 లక్షల ఆదాయం

కొవ్వూరు: సారా కేసుల్లో స్వాధీనం చేసుకున్న 45 వాహనాలకు పట్టణంలోని ఎస్‌ఈబీ స్టేషన్ వద్ద బుధవారం వేలం నిర్వహించగా రూ.6,02,900 ఆదాయం సమకూరినట్టు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. రాజమహేంద్రవరం అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంటు సూపరింటెండెంట్ ఎం.రాంబాబు వేలం నిర్వహించారని, ఈ వేలం సొమ్మును ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నట్టు చెప్పారు. ఎస్సై జి.బసంతి, ఏఎస్సై ధర్మరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

చాగల్లు: మండల పరిధిలోని నిడదవోలు- పంగిడి రహదారిపై బుధవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో మోటార్ సైకిళ్లపై ప్రయాణిస్తున్న పలువురు గాయపడ్డారు. ఊనగట్ల సమీపంలో రెండు మోటార్ సైకిళ్లు ఢీ కొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో నిడదవోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మీనానగరంలో మోటార్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తికి కుక్క అడ్డుగా రావడంతో కిందపడి గాయపడ్డాడు.

పురుగు మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

పెరవలి: పురుగు మందు తాగిన మండలంలోని గవర్లపాలెం గ్రామానికి చెందిన కాండ్రేకుల సత్యనారాయణ (62) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పెరవలి ఎస్‌ఐ సూర్య భగవాన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సత్యనారాయణకు మూడు నెలల క్రితం పక్షవాతం వచ్చింది. లేవలేని స్థితిలో ఉన్నాడు. కుటుంబానికి తాను భారం కారాదని భావించిన సత్యనారాయణ మంగళవారం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి, ఆయనను తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆసుపత్రికి, అక్కడి నుంచి విజయవాడ ఆసుపత్రికి తరలించారు. విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెరవలి: జాతీయ రహదారిపై మండలంలోని అన్నవరప్పాడు వద్ద ఈ నెల 2న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిని ఇద్దరిలో ఒకరు బుధవారం మృతి చెందారు. స్థానిక ఎస్‌ఐ సూర్య భగవాన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామానికి చెందిన బోడపాటి మారియ్యా (55) సోమవారం తణుకు నుంచి రావులపాలెం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. అన్నవరప్పాడు వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న తణుకుకు చెందిన వైట్ల విశ్వేశ్వరరావును వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురినీ 108 వాహనంలో తొలుత తణుకుకు, అక్కడి నుంచి ఏలూరు ఆసుపత్రికి తరలించారు. మరింత మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించగా అక్కడ వైద్యం పొందుతూ మారియ్యా బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అలరించిన సంప్రదాయ వస్త్ర ప్రదర్శన



సంప్రదాయ వస్త్ర ప్రదర్శన చేస్తున్న మహిళలు

నిడదవోలు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిడదవోలు ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంప్రదాయ వస్త్ర ప్రదర్శన, వంటలు, ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. స్థానిక రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ పోటీల్లో రోటరీ సభ్యుల సతీమణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రాలు ధరించి క్యాట్ వాక్ చేశారు. వారు తమ ఇంటి వద్ద తయారు చేసిన వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. రోటరీ మహిళలు పోటాపోటీగా రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం ముగ్గురు పేద విద్యార్థులకు సైకిళ్లు, ముగ్గురు పేద మహిళలకు కుట్టు మెషీన్లు క్లబ్ తరఫున పంపిణీ చేశారు. ఈ పోటీల్లో విజేతలకు ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ పి.సీతాదేవి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు గుంటుపల్లి సత్యకుమారి, క్లబ్ కార్యదర్శి ఎండీ షకీరా బేగం, కోశాధికారి గుంటుపల్లి సవిన్య, నీలం సరిత, కామిశెట్టి రాజీ, కేదారిశెట్టి సునీత, వికిత జైన్, ఇన్నర్ వీల్ సభ్యులు పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్ల పంపిణీ

కొవ్వూరు: లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు.లయన్స్ క్లబ్ సభ్యుడు గూడపాటి ప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా ఆసుపత్రిలోని రోగులు, వారి సహాయకులకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు కంఠమణి రామకిషోర్, సభ్యులు పెనుమాక జయరాజు, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, మన్యం బులిబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పేదలకు పింఛన్లు

- గోపాలపురం ఎమ్మెల్యే వెంకట్రావు
- పలు ప్రాంతాల్లో కొత్త పింఛన్ల పంపిణీ



నల్లజర్లలో పెన్షన్లు అందజేస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



తాడిమళ్లలో లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నల్లజర్ల: అర్హత గల పేదలందరికీ వైఎస్సార్ పెన్షన్ కానుక కింద సామాజిక పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండల స్థాయి కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నల్లజర్లలోని అల్లాడ రామయ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీఓ జోగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ మండలంలో గతంలో 10,900 పింఛన్లు ఉండగా, ఇపుడు కొత్తగా మరో 399 మందికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేసిందన్నారు. మండలంలోని మొత్తం 11,299 పెన్షన్లకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.3.12 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంక జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, నల్లజర్ల సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పార్టీ నాయకులు బంక అప్పారావు, పంది సత్యనారాయణ, తాడిగడప శ్రీనివాస్, ముప్పిడి వెంకటరత్నం, వామిశెట్టి పరమేశ్వరరావు, ఆరేళ్ళ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీని స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 1468 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయన్నారు. మొత్తం 41,349 మంది లబ్ధిదారులకు రూ.11.23 కోట్ల పింఛను సొమ్మును ప్రతి నెలా వలంటీర్ల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి, నరహరిశెట్టి రాజేంద్రబాబు, కొర్లపాటి అరుణ, సాదే సుబ్బారావు, కూచిపూడి సతీష్ , ఎంపీడీఓ కె. ఉమామహేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం కొత్త పింఛన్ల పంపిణీ వారోత్సవాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, ఎంపీడీవో ఏపీ సుబ్బరాయన్ తదితరులతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు.



ఖండవల్లిలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తదితరులు



ఉండ్రాజవరంలో కొత్త పింఛనుదారులతో బూరుగుపల్లి సుబ్బారావు, ప్రజాప్రతినిధులు

సంక్షేమ ప్రభుత్వంగా ప్రజల గుండెల్లో ..

నిడదవోలు రూరల్: గతంలో ఏ ప్రభుత్వమూ, ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తూ దేశంలోని ఏకైక సంక్షేమ ప్రభుత్వంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొనసాగుతోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తాడిమళ్ల, కోరుమామిడి గ్రామాల్లో కొత్తగా మంజూరైన పెన్షన్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో ఎవరో ఒకరు చనిపోతేనే కొత్తవాళ్లకు పింఛను ఇచ్చేవారని గుర్తు చేశారు. సీఎం జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ ఇస్తున్నామన్నారు.కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, సర్పంచులు అంబటి గోపమ్మ, బయ్యే రాధారాణి, ఎంపీటీసీ సభ్యులు కొప్పుల నాగేశ్వరరావు, వరిగేటి సౌజన్య, సొసైటీ అధ్యక్షుడు వింతా గంగాధర్ రెడ్డి, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలు: పట్టణంలో కొత్తగా మంజూరైన 165 పింఛన్లను పట్టణంలో స్థానిక కిరణా మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడి చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు కామిశెట్టి వెంకట సత్యనారాయణ, కొత్తపల్లి సుప్రియ, అహ్మదున్నీసాబేగం, చిలకల శారదాదేవి, గుర్రం శాంతిశ్రీ , మద్దిపాటి నాగశ్రీ, గోపిరెడ్డి శ్రీనివాస్, ఆకుల ముకుందరావు, ఉసురుమర్తి జాన్‌బాబు, అరుగొళ్ళు వెంకటేశ్వర్లు, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పెరవలి మండలంలో కొత్తగా 290 మందికి..

పెరవలి: మండలంలో 10,365 మంది పింఛనుదారులు ఉండగా, కొత్తగా మరో 290 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. మరోపక్క ప్రతినెలా రూ.2500 చొప్పున చెల్లిస్తున్న పింఛను సొమ్మును ఈ నెల నుంచి రూ.2750 కి పెంచిన విషయం తెలిసిందే. ఖండవల్లిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ గ్రామంలోని కొత్త పింఛనుదారులు 58 మందికీ ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ చేతుల మీదుగా పింఛను సొమ్ము అందజేశారు. అలాగే లబ్ధిదారులు అందరికీ స్వీట్ బాక్సులు కూడా పంపిణీ చేశారు. ఎంపీడీఓ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సిపి నాయకులు, పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరానికి కొత్తగా మంజూరైన పింఛన్లను జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు చేతులమీదుగా లబ్ధిదారులకు బుధవారం అందజేసారు. అలాగే వేలివెన్నులో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, పాలంగిలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, మిగిలిన గ్రామాల్లో ఆయా పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను అందజేశారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ నరహరిశెట్టి సరోజ, ఎంపీటీసీ సభ్యుడు గాడి కృష్ణఫర్, కార్యదర్శి సుదీప్తి, వార్డ్ మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా గడప గడపకూ..

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- సత్యవాడ కొత్తపేట కాలనీలో పర్యటన



సత్యవాడలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి రూపకల్పన చేశారని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని సత్యవాడ గ్రామంలోని కొత్తపేట కాలనీలో ఎస్సీ, బీసీ ఏరియాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఆయా ఇళ్లకు చేకూరిన లబ్ధిని సంక్షేమ క్యాలెండర్‌తో సహా లబ్ధిదారులకు వివరించారు. గ్రామ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు తన ప్రసంగంలో గత ప్రభుత్వానికి, ప్రస్తుత జగనన్న ప్రభుత్వానికి గల వ్యత్యాసాన్ని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కులం, మతం, పార్టీలకు అతీతంగా పథకాలను అందిస్తున్న ప్రభుత్వం దేశంలో మరెక్కడా లేదన్నారు. టీడీపీ నాయకులు గ్రామాల్లోకి వచ్చి ప్రభుత్వంపై లేనిపోని అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. వాటిని నమ్మవద్దని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సత్యవాడ సర్పంచ్ ఇందుకూరి దేవీభార్గవి, ఐవీఎస్ రాజు, పెన్మత్స సుబ్బరాజు, మరపట్ల నాగరాజు, కె. శ్యాంబాబు, ఎస్. శ్రీనివాసరాజు, బి.సత్యనారాయణ, డి.రాముడు పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లా అందరి బాధ్యత

- జిల్లా అధికారి డాక్టర్ వసుంధర
- క్షయ రోగులకు పోషకాహారం అందజేత



క్షయ రోగులకు పోషకాహారం అందిస్తున్న డీటీసీఓ వసుంధర, ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: తూర్పుగోదావరిని క్షయ వ్యాధి రహిత జిల్లా చేయడంలో అందరూ భాగస్వాములు కావాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వసుంధర కోరారు. స్థానిక పరమేశు బయోటెక్ సహకారంతో 12 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు బుధవారం నెలకు సరిపడా పోషకాహారం అందజేశారు. ఈ సందర్భంగా దేవరపల్లి పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారి అశ్వవర్ధన్ అధ్యక్షన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ వసుంధర మాట్లాడారు. ధనిక, పేద అనే భేదం లేకుండా దేశంలో క్షయవ్యాధి రోజురోజుకూ పెరిగిపోతోందన్నారు. ఇది దుమ్ము, ధూళి వల్ల వ్యాపిస్తుందన్నారు. ప్రపంచ దేశాలతో పోలిస్తే దేశంలో ఈ వ్యాధి ఎక్కువగా ఉందన్నారు. ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ ద్వారా క్షయ రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేస్తారన్నారు. ప్రతి రోగికీ నెలకు రూ.500 చొప్పున పౌష్టికాహారానికి అందిస్తున్నట్టు తెలిపారు.ఈ వ్యాధికి ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స లేదన్నారు. పరమేశు బయో టెక్ సహకారంతో మండలంలోని 12 మంది రోగులకు ప్రతినెలా పోషకాహారాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు కూడా ప్రసంగించారు. స్థానిక పీహెచ్‌సీలో ఉమ్మి, నీరుడు పరీక్షలు ఏర్పాటు చేసి, మందులు అందించాలని క్షయ రోగులు కోరారు. కార్యక్రమంలో పరమేశు బయోటెక్ జీఎం శివప్రసాద్, సీహెచ్‌ఓ అప్పారావు, పలువురు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతం చేయండి

కొవ్వూరు: ఫిబ్రవరి 11న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి పి.అన్నపూర్ణ కోరారు. స్థానిక కోర్టు కాంప్లెక్స్‌లో బుధవారం సాయంత్రం పోలీసు, న్యాయవాదులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.రాజీ పడదగిన కేసులన్నింటినీ లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు పోలీసులు సహకరించాలని సూచించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, సెకండ్ అడిషనల్ అండ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.శారదాంబ, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.బాల త్రిపుర సుందరీదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నీరుకొండ సూర్యనారాయణ, పలువురు న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


'తానా' సహకారంతో విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



చాగల్లు హైస్కూల్లో తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

చాగల్లు: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తానా అసోసియేషన్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండేషన్ చైర్మన్, పాఠశాల పూర్వ విద్యార్థి గారపాటి విద్యాధర్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ చైర్మన్ ప్రమీలారాణి ఈ పాఠశాల్లోని 920 మంది విద్యార్థులకు దుప్పట్లు అందజేశారు. ఆ పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ఏ దేశ మేగినా మాతృభూమిని మరవకుండా తాను చదివిన పాఠశాలకు విద్యాధర్ సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో రక్షిత మంచినీటి ట్యాంక్, ఆటస్థలం అభివృద్ధికి తానా సంస్థ ద్వారా కృషి చేస్తానని విద్యాధర్ హామీ ఇచ్చారు. అనంతరం దాతలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వీ ద్రాజు, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు ముద్రగడ భగవాన్, బి.మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీడిపప్పు, సిరామిక్ ఫ్యాక్టరీలకు ప్రాధాన్యం



విలేకరుల సమావేశంలో వెంకట్రావు

ద్వారకాతిరుమల: మండలంలోని జి.కొత్తపల్లిలో ఏర్పాటు చేయతలపెట్టిన పారిశ్రామిక పార్కులో జీడిపప్పు, సిరామిక్ ఫ్యాక్టరీల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇస్తామని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చెప్పారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ పార్కు ఏర్పాటుకు ఏపీఐఐసీ ద్వారా 100 ఎకరాల భూమిని కేటాయించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ పరిశ్రమలు స్థాపించుకునే వారికి 40 శాతం సబ్సిడీపై రుణాలు కూడా అందిస్తామన్నారు. ఇండస్ట్రియల్ ఏరియాను దృష్టిలో పెట్టుకుని దూబచర్ల నుంచి జి.కొత్తపల్లి వరకూ త్వరలో నాలుగు లేన్ల రహదారిని నిర్మిస్తామని ఎమ్మెల్యే చెప్పారు.

అవంతి ఫౌండేషన్ సేవా దృక్పథం భేష్

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరులో ఉచిత వైద్యశాల ప్రారంభం



ఉచిత హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వనిత, అవంతి ఫౌండేషన్ చైర్మన్ ఇంద్రకుమార్

కొవ్వూరు: సేవా దృక్పథంతో అవంతి ఫౌండేషన్ అనుభవజ్ఞులైన వైద్యులతో ఆసుపత్రి ఏర్పాటు చేసి పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం హర్షణీయమని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలోని బాపూజీ నగర్‌లో ఏర్పాటు చేసిన అల్లూరి బాపినీడు హెల్త్ క్లినిక్‌ను మంత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.లక్షలు వెచ్చించి వైద్య పరికరాలు కొనుగోలు చేసి, నెల రోజుల పాటు ఉచిత సేవలు అందించడంతో పాటు అవసరమైన రోగులకు మందులు కూడా ఉచితంగా ఇవ్వడం అభినందించదగిన విషయమన్నారు. రానున్న రోజుల్లో కొవ్వూరు ప్రజలకు మరిన్ని సేవలందించే దిశగా ప్రయత్నించాలని అవంతి ఫౌండేషన్ యాజమాన్యానికి సూచించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో మంత్రి వనితతో పాటు కార్యక్రమానికి హాజరైన ప్రముఖులందరూ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవంతి ఫౌండేషన్ చైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో వివిధ రకాల పరీక్షలకు అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలుకు సుమారు రూ.80 లక్షలు వెచ్చించామన్నారు. నిత్యం అనువజ్ఞులైన వైద్యులను నియమించామన్నారు. ఈ నెలాఖరు వరకు ఉచిత వైద్యసేవలు అందిస్తామన్నారు. అనంతరం కేవలం నామమాత్రపు రుసుముతో సేవలందించనున్నట్టు ఇంద్రకుమార్ ప్రకటించారు.మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి, వైస్ చైర్ పర్సన్లు మన్నె పద్మ, గంధ్రోతు అంజనీదేవి, అవంతి ఫీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లూరి వెంకట సంజీవ్, ప్రాజెక్టు డైరెక్టర్ కావ్య, పరిమి హరిచరణ్, గుడివాక శ్రీనివాస్, దుద్దుపూడి రామచంద్రరావు, పొట్రు రాజేంద్ర, మహా మహోపాధ్యాయ దోర్భల ప్రభాకర శర్మ పాల్గొన్నారు.

హిందూ ధర్మ ప్రచారం

కొవ్వూరు: ఆరికిరేవుల లో బుధవారం హిందూ ధర్మ ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంతం ప్రభోద సేవాసమితి ఆధ్వర్యంలో జరిగింది. ఆ సంస్థ రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబుతోపాటు లోహిత, సోమినాయుడు, సత్యవతి, రాణి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



కొవ్వూరులో వైఎస్సార్ టీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన హోం మంత్రి తానేటి వనిత తదితరులు

కొవ్వూరు: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ- 2023 క్యాలెండర్‌ను రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఆవిష్కరించారు. పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రభుత్వానికి వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ తోడ్పాటు అందించాలని మంత్రి కోరారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కవల వెంకట్రావు, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు గొంతి సతీష్, జిల్లా మహిళా కార్యదర్శి సూర్యకుమారి, ఈశ్వర్, తాళ్లపూడి మండల శాఖ నాయకుడు కలుం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల క్యాలెండర్..

నిడదవోలు: ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను బుధవారం యూనియన్ కార్యాలయంలో అధ్యక్షుడు జీవీ కృష్ణారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి వీవీవీ ప్రసాద్, ఎంబీకే వాసుదేవరావు, కుందుల ప్రభాకరం , ఎస్.సత్యనారాయణ, కె.కృష్ణమూర్తి, గండేపల్లి సుభోష్, జెఎస్‌కే భగవాన్‌రావు, ఎం.శర్మ తదితరులు పాల్గొన్నారు.